క్లుప్తంగా...

బతుకమ్మ చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు బతుకమ్మ చీరలను జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పంపిణీ చేశారు. ప్రతియేటా ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తూ మహిళలకు ఉచితంగా చీరలతో కూడిన కానుకలను అందజేస్తున్నారు. డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికి చీరల పంపిణీ జరుగుతుందని కార్పొరేటర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు కూడా పాల్గొన్నారు.

సీవరేజి పనులు ప్రారంభం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46లోని అంబేద్కర్‌నగర్ బస్తీలో సీవరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులు శనివారం ప్రారంభించారు. బస్తీ పుట్టినప్పటి నుంచి నేటి వరకు ఈ బస్తీలో సరైన సీవరేజి వ్యవస్థ లేకపోవడంతో ఇక్కడ రూ. 38 లక్షల వ్యయంతో 200 ఎంఎంతో పాటు 300 ఎంఎం డయా పైప్‌లైన్‌ను 560 మీటర్ల మేర నిర్మిస్తున్నట్లు జలమండలి జూబ్లీహిల్స్ మేనేజర్ శ్రీహరి తెలిపారు.

నాణ్యతాలోపాలు రాకుండా పనులు పూర్తి చేయాలి


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: ప్రజాధనంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతాలోపాలు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అధికారులకు సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌కాలనీ వెంచర్–3లో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని అన్నారు.

ఉచితంగా కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని ఆశ్రయ్–ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వినికిడి సమస్యలను చిన్నతనంలోనే పోగొట్టడానికి లక్షల్లో ఖర్చయ్యే ఈ సర్జరీలను ఉచితంగా చేపిస్తున్నామన్నారు. వివరాలకు శ్రీనగర్‌కాలనీలోని 9100779276, 9281096371 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

సర్కిల్–17 ఇన్‌చార్జి ఏఎంహెచ్‌ఓగా ప్రవీణ



బంజారాహిల్స్: ఖైరతాబాద్ సర్కిల్–17 ఏఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ భార్గవ్ నారాయణ కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో ప్రస్తుతం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్–19 ఏఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎంహెచ్‌ఓ భార్గవ్ నారాయణ సర్కిల్–17లో ఏడేళ్లకు పైగా విధులు నిర్వహించడతో పలు ఆరోపణలు రావడంతో బదిలీ జరిగినట్లు సమాచారం.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్ళిన సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బీహార్‌కు చెందిన త్రిలోక్‌సింగ్ కళ్యాణ్‌నగర్ క్రాస్‌రోడ్స్‌లో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 5న మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటి నుంచి విధులకు బయలుదేరాడు. అయితే డ్యూటీకి రాలేదు. దాంతో 6వ తేదీనాడు సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సతేందర్ యాదవ్ అతని ఫోన్ చేశాడు. అయితే త్రిలోక్‌సింగ్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయబడి ఉంది. అనుమానం వచ్చి అతను నివసించే ప్రాంతంలో విచారించాడు. విధులకు హాజరు కాలేదు. ఇంటికి వెళ్ళలేదు. దాంతో సతేందర్ యాదవ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతపై జలమండలి నజర్

- వెంట వెంటనే మురుగు వ్యర్థాల తొలగింపు
- జలమండలి డివిజన్–6 పరిధిలో 12 వాహనాల కేటాయింపు


మురుగు వ్యర్థాల తరలింపు రవాణా వాహనాలు

బంజారాహిల్స్: ఓ వైపు యువతకు ఉపాధి కలిస్తూనే మరోవైపు పరిసరాల పరిశుభ్రతపై జలమండలి దృష్టిసారించింది. దళితబంధు పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇటీవల మురుగు వ్యర్థాల రవాణా (సిల్ట్ కార్టింగ్) వాహనాలను పంపిణీ చేశారు. ఈనెల 3న మంత్రి కేటీఆర్ లబ్ధిదారులకు ఈ వాహనాలు పంపిణీ చేశారు. ఈ వాహనాల ద్వారా కుటుంబాలు ఉపాధి పొందడమే కాకుండా డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి, పైప్‌లైన్ల నుంచి తొలగించిన వ్యర్థాలను అప్పటికప్పుడే ఎత్తి ఈ వాహనం ద్వారా తరలించనున్నారు. జలమండలి ఆధ్వర్యంలో నడిచే మురుగు వ్యర్థాల రవాణా వాహనాలను జలమండలి డివిజన్–6 పరిధిలోని 12 సెక్షన్ కార్యాలయాలకు ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. దళిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని వల్ల ఆయా కుటుంబాలకు జీవనోపాధి లభించడంతో పాటు ఆర్థికంగా స్థిరపడే అవకాశాన్ని కల్పించారు. డివిజన్–6 పరిధిలో ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టికాన, ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, సోమాజిగూడ, ఫతేనగర్, ఎస్ఆర్‌నగర్ సెక్షన్లకు ఒక్కొక్కటి చొప్పున వీటిని అందజేశారు.

వాహనం విశేషాలు..

- ఇది స్టెయిన్‌లెస్ స్టీల్ కంటైనర్.
- లిక్విడ్ కలెక్షన్ కూడా చేపడుతుంది.
- డ్రైన్ పైప్ అలైన్‌మెంట్ కలిగి ఉంది.
- ఆటో లిఫ్టింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేశారు.
- సేఫ్టీ కిట్ యూనిట్ కూడా అందుబాటులో ఉంచారు.
- దుర్వాసనలు రాకుండా పైన టార్పాలిన్ కవర్ ఏర్పాటు చేశారు.
- లిక్విడ్‌లో నుంచి చుక్కలు చుక్కలుగా మురుగు కిందపడకుండా కలెక్షన్ పాయింట్ ఏర్పాటు చేశారు.

అప్పటికప్పుడు మురుగు వ్యర్థాల తొలగింపు..

ఇప్పటి వరకు ఏదైనా మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాలు తొలగిస్తే వాటి పక్కనే కుప్పగా పోసి వెళ్లిపోయేవారు. రెండు రోజుల తర్వాత ఆ వ్యర్థాలు ఎండిపోగానే తొలగించేవారు. అప్పటి వరకు దుర్వాసన, దుర్గంధంతో స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూసేవారు. జలమండలి సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసేవారు. తాజాగా ప్రవేశపెట్టిన సిల్ట్ కార్టింగ్ వాహనాలతో తొలగించిన వెంటనే ఈ ప్రత్యేక వాహనంలోకి తరలిస్తారు. ఇవి నేరుగా అంబర్‌పేట్ ఎస్టీపీలోకి ఈ వ్యర్థాలను పంపిస్తాయి.

మురుగు వ్యర్థాలు ఉంటే 155313కి సమాచారం ఇవ్వాలి..



కొత్తగా ప్రవేశపెట్టిన మురుగు వ్యర్థాల రవాణా వాహనాల వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. వీటిని ప్రత్యేక డిజైన్‌తో రూపొందించారు. మురుగు, వ్యర్థాలు తొలగించిన వెంటనే ఈ వాహనంలో తరలిస్తారు. దారి పొడవునా దుర్వాసనలు రాకుండా, చుక్కలు చుక్కలుగా మురుగు నీళ్ల పడకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఎక్కడైనా మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాలు తీసిన తర్వాత ఎత్తకపోతే 155313 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు. ఇంకోవైపు సెక్షన్‌కు ఒకటి చొప్పున ఈ వాహనాలు పంపిణీ చేశాం. లిక్విడ్ కలెక్షన్ పాయింట్ కూడా ఉండటం వల్ల వ్యర్థాలు పచ్చిగా ఉన్నా తొలగించడానికి అవకాశం ఉంది.

– హరిశంకర్, జలమండలి జీఎం

ఒకే ఇంట్లో ముగ్గురికి కానిస్టేబుల్ కొలువులు


కానిస్టేబుళ్లుగా సెలెక్ట్ అయిన కుమారులు, కోడలితో గోపాల్ దంపతులు

బంజారాహిల్స్: ఒకే ఇంట్లో ముగ్గురు కానిస్టేబుల్ కొలువులు దక్కించుకున్నారు. ఈ అరుదైన ఘటన ఫిలింనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో నివసించే కె.గోపాల్ కంటోన్మెంట్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆయనకు వాసు, వినయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వాసు భార్య భవానీతో పాటు వినయ్ వాసు ముగ్గురూ కానిస్టేబుల్ ఉద్యోగానికి పరీక్ష రాయగా వీరందరూ సెలెక్ట్ అయ్యారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఈ ముగ్గురికీ కానిస్టేబుల్ ఉద్యోగాలు రావడం పట్ల బంధుమిత్రులతో పాటు బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గోపాల్ భార్య శ్యామల గృహిణి కాగా పిల్లలంతా చక్కని చదువులతో ముందుకు సాగారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం


తెలంగాణ రాష్ట్ర డాక్టర్స్ ఫోరం ప్యానెల్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ముందుకు పోతామని తెలంగాణ స్టేట్ డాక్టర్స్ ఫోరం స్పష్టం చేసింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ)కు జరుగుతున్న ఎన్నికల్లో 13 మంది వైద్యులతో కూడిన ప్యానల్ పోటీలో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్యానల్ కరపత్రాన్ని ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాసులు, గోంగూర వెంకటేశ్వర్లు, సి.శ్రీనివాస్, లింగంగౌడ్, కీర్తన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువచ్చే విప్లవాత్మక మార్పులకు సలహాలు, సూచనలు ఇచ్చే అత్యంత కీలకమైన టీఎస్ఎంసీకి రాష్ట్రం ఏర్పడ్డాక మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. వృద్ధ వైద్యులకు డాక్టర్ రెన్యువల్ ఉచితంగా చేస్తామని, టీఎస్ఎంసీకి నూతన భవనం నిర్మిస్తామని, ఆరోగ్య తెలంగాణగా మార్చడమే లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో మొత్తం 25 మంది బాడీ ఉండగా అందులో 12 మందిని ప్రభుత్వం నియమిస్తుందని మిగిలిన 13 మంది కోసం ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 45405 మంది వైద్యులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారని నవంబర్ 15 లోపు బ్యాలెట్ పేపర్లు సదరు ఓటర్ల ఇంటికి వస్తాయని వారు బాల్‌పాయింట్ పెన్‌తో 13 మంది అభ్యర్థులను ఎన్నుకుని వారి ఆధార్‌కార్డు జిరాక్స్ జతపరిచి, సంతకం పెట్టి పోస్టు ద్వారా ఓటును నవంబర్ 30 లోపు పంపాలని తెలిపారు. 13 మంది అభ్యర్థులకన్నా ఒక్కర్ని ఎక్కువగా ఎన్నుకున్నా అది చెల్లకుండా పోతుందన్నారు.

విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి


వినోద్‌కుమార్‌ను కలిసిన వలిగొండ శ్రీనివాస్

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను దళిత బహుజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం వినోద్‌కుమార్‌ను కలిసి పూల మొక్కను అందించి వినతిపత్రం సమర్పించారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వ విద్యా రంగాన్ని పటిష్టం చేసేందుకు మరిన్ని నిధులు కేటాయించాలని విన్నవించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో బలోపేతం చేయాలని విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అల్పాహార పథకాలను ప్రవేశపెట్టినందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకుడు అలపాటి లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్: కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్టు బీజేపీ సీనియర్ నాయకుడు అలపాటి లక్ష్మీనారాయణ అన్నారు. మోదీ చేపడుతున్న కార్యక్రమాలతోకూడిన వాల్‌పోస్టర్‌ను ఆయన శనివారం జూబ్లీహిల్స్ లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేదన్నారు. వీటిని వివరించేందుకు నియోజకవర్గంలో ప్రతి డివిజన్, ప్రతి వీధిలో పాదయాత్ర చేసి ప్రజలను కలుకోనున్నట్టు చెప్పారు. నగర శివారు ప్రాంతాల్లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూంలు కేంద్ర మంత్రి ఆవాస్ యోజన కింద వచ్చిన నిధులతో నిర్మించినవని కాని రాష్ట్ర ప్రభుత్వం తామే నిర్మించినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఫైర్‌మెన్ రాజుకు శౌర్య పతకం

సనత్‌నగర్: సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎనపోతుల రాజుకు తెలంగాణ శౌర్య పతకం వరించింది. హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా పతకం అందుకున్నారు. సెక్రటేరియట్ సమీపంలో ఉన్న ఆంధ్రా బ్యాంక్‌లో 2019 మార్చిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న 39 మంది ఉద్యోగులను రాజు, బీఏ (బ్రీతింగ్ ఆక్సిజన్) సెట్ ధరించి ప్రాణాలను పణంగా పెట్టి కాపాడారు. దీనిని గుర్తించిన అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ఆర్ఎఫ్ఓ హరినాథ్‌రెడ్డి, హైదరాబాద్ డీఎఫ్ఓ శ్రీనివాస్‌రెడ్డి, సికింద్రాబాద్ డీఎఫ్ఓ శ్రీనివాస్‌రెడ్డి, సనత్‌నగర్ ఎస్ఎఫ్ఓ ప్రదీప్‌కుమార్ అభినందించి రాజు ప్రతిభను కొనియాడారు. అదే విధంగా బోట్, రెస్క్యూ ఆపరేషన్స్‌లో తాను చూపిన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ శౌర్య పతకంతో సత్కరించింది.

డబుల్ బెడ్‌రూమ్ అందించడంలో ప్రభుత్వం విఫలం

చిక్కడపల్లి: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ అపాధ్యక్షులు గుర్రం శంకర్ ఆరోపించారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎల్లయ్య బస్తీలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న పేదలు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసనకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడుతూ బస్తీలో 24 కుటుంబాలు ఉన్నాయని 14 మంది దరఖాస్తు చేసుకున్నా ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూమ్ మంజూరు కాకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నంచారు. బీఆర్ఎస్ మద్దతుదరులకే ఇళ్లను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గుర్రం చంద్రకళ శంకర్, కృష్ణయాదవ్, స్థానికులు ఉమేష్, శంకర్, చంద్రకళ, పద్మ వెంకట్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోయి లేచేసరికి గదిలోని వస్తువులు మాయం

వెంగళరావునగర్: తన గదిలో విలువైన వస్తువులు దాచి రాత్రి నిద్రించి ఉదయం లేచేసరికి అవి మాయం అయిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ములుగు జిల్లా చింతలపల్లి ప్రాంతానికి చెందిన గంగుల ప్రవీణ్ రహమత్‌నగర్ నివాసముంటున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని గదిలోనే దినేష్, సలేందర్ సింగ్ అనే యువకులు కూడా ఉంటున్నారు. ఈనెల 3వ తేదీనాడు అతనికి సంబంధించిన రెండు ఫోన్లు, స్మార్ట్ వాచ్, పర్స్‌లో రూ.2500 నగదు ఉంచి నిద్రపోయాడు. తెల్లవారుజామున 4.30 గంటలకు తన రూంలోనే ఉంటున్న దినేష్ అనే యువకుడు వేరే ఊరు నుంచి వచ్చిన తన తల్లిని తీసుకురావడానికి వెళ్ళాడు. ఈ సమయంలో రూము తలుపులు తెరిచే ఉన్నాయి. కాగా ప్రవీణ్ ఉదయం 6 గంటలకు లేచి చూసుకునే సరికి తన ఫోన్లు, వాచ్‌తో పాటు పర్స్‌లో ఉండాల్సిన నగదు మాయం అయ్యాయి, ఆందోళన చెందిన రూములో ఉన్న వారిని పక్క గది వారిని విచారించాడు. అయితే ఫలితం లేకుండా పోయింది. దాంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'బెదిరించి.. అక్రమ కేసులు పెడతామని భయపెడుతున్నారు'

వెంగళరావునగర్: అకారణంగా తన కుటుంబ సభ్యులను కొట్టడమే కాకుండా అక్రమ కేసులు పెడతానని కొందరు బెదిరిస్తున్నారని ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లో గీతాప్రభ అనే మహిళ నివాసం ఉంటుంది. రామగుండం నివాసితులైన కె.జగన్‌మోహన్‌రావు, కె.మంజుల, కె.శ్రీదేవి ఆమె కోడలు గాయత్రీలు గీతాప్రభను, ఆమె కుటుంబ సభ్యులకు హాని కలిగిస్తున్నారని తెలియజేసింది. గత నెల 12 దుర్భాషలాడుతూ, శారీరకంగా దాడికి పాల్పడ్డారు. వారి వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహానీ ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్, ఇందిరానగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకోని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

క్రమశిక్షణే దిక్సూచి

సాక్షి, సిటీబ్యూరో : నాసర్ స్కూల్ 58వ యాన్యువల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఎల్‌బీ స్టేడియం ఆవరణలో నిర్వహించిన ఈ మీట్‌లో విద్యార్థులు పలు రకాల ఈవెంట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ తేజ్‌దీప్‌కౌర్ మీనన్ మాట్లాడుతూ విద్యార్థిగా నేర్చుకున్న క్రమశిక్షణ జీవితాంతం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ స్వప్న, ప్రిన్సిపల్ మీర్ మొహియుద్దీన్, సుమతి పాల్గొన్నారు. విజేత విద్యార్థులను మెమెంటోలతో అభినందించారు.



బ్రేక్‌ఫాస్ట్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి


సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంను పరిశీలిస్తున్న వాకాటి కరుణ, రొనాల్డ్ రాస్

పంజగుట్ట: సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, జీహెచ్ఎంసీ కమిషన్ రొనాల్డ్ రాస్ అన్నారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలను వారు శనివారం పరిశీలించారు. స్కూల్‌కు బ్రేక్ ఫాస్ట్ వస్తున్న సమయంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌ను వడ్డించారు. వారితో కూర్చొని బ్రేక్‌ఫాస్ట్ రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో దొరుకుతున్న సౌకర్యాలతో పాటు ఏవైనా సమస్యలున్నాయా అని అడిగారు. రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ కొంత మంది విద్యార్థులు పొంగల్‌లో సాంబారును వద్దంటున్నారని ప్రత్యేకంగా ఏదైనా చట్నీ తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న రెడ్డి ఐక్యవేదిక నాయకులు

పంజగుట్ట: ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే రెడ్డి కార్పొరేషన్ ప్రకటించాలని లేకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రెడ్డిల సత్తా చూపుతామని రెడ్డి ఐక్యవేదిక హెచ్చరించింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి కార్పొరేషన్ సాధనకోసం రెడ్డి ఐక్యవేదిక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు డి.శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పి.నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఇ.మోహన్‌రెడ్డి, మహిళా ప్రతినిధి సులోచనారెడ్డి మాట్లాడూతూ.. 2018 ఎన్నికల సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి రెడ్డి కులంలో కూడా ఎంతో మంది పేదవారు ఉంటారు వారి కోసం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా ఎదిగేలా చేస్తామని హామీ ఇచ్చి గంపగుత్త ఓట్లు వేయించుకున్నాడన్నారు. వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే అవసరమైతే కేసీఆర్ పోటీ చేయనున్న గజ్వేల్ నుంచి కామారెడ్డి వరకు పాదయాత్ర చేసి రెడ్డిలను చైతన్యపరుస్తామన్నారు. ప్రగతిభవన్ ముట్టడించేందుకు కూడా వెనక్కి వెల్లమని హెచ్చరించారు. సమావేశంలో సునీల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ బస్తీలో విజయారెడ్డి పర్యటన

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్‌రోడ్ నెం.5 దేవరకొండ బస్తీలో శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. దేవరకొండ బస్తీ, పంజగుట్ట ధోబీఘాట్ బస్తీల్లో పర్యటించి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను గుర్తించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. తనను ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ఈ కరపత్రాల ద్వారా ఒక వైపు కాంగ్రెస్ హామీలు, రాహుల్ గాంధీ సందేశాన్ని కూడా ప్రజలకు తెలియజేసినట్లు ఆమె తెలిపారు. బస్తీలో తనకు అనూహ్యమైన ఆదరణ లభించిందని వెల్లడించారు.


దేవరకొండ బస్తీలో పర్యటిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

శరీరదానం చేయడానికి ముందుకు రావాలి



అవగాహన కలిగిస్తున్న సంఘం ప్రతినిధులు

ఫిలింనగర్: సమాజహితం కోసం ప్రతిఒక్కరూ తమ నేత్రాలతో పాటు రక్తదానం చేయడానికి, వైద్య విద్యార్థుల భవిష్యత్ రంగ ప్రయోజనాల కోసం శరీరదానం చేయడానికి ముందుకు రావాలని అమ్మ నేత్ర, అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘం అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం కోరారు. యువతకు రక్తం, నేత్ర, అవయవాలు, స్కిన్, హెయిర్ శరీరదానంపై అవగాహన కలిగించేందుకు ప్రభుత్వ ఈఎస్ఐ కాలేజీ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుత్తా జ్యోత్స్న, డీవీకే కిశోర్, పి. విజయ్‌కుమార్, శశిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


స్వరూప(ఫైల్)

రహమత్‌నగర్ : బోరబండ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌కు చెందిన స్వరూప(27) రెండు వారాల క్రితం ఇంటి నుండి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి తల్లి యాదమ్మ శనివారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

9 వరకు తాజ్ డెక్కన్‌లో బ్రాండెడ్ ఉత్పత్తుల ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాక్టరీ నుంచి నేరుగా అందుబాటులోకి వచ్చిన బ్రాండెడ్ దుస్తులు, షూస్ తదితర ఉత్పత్తుల ప్రదర్శన బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్లో ఏర్పాటైంది. దీనిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో బెనెటన్, రేమాండ్స్, వ్రాగస్, యారో, కలర్ ప్లస్, పార్క్ అవెన్యూ వంటి టాప్ బ్రాండ్స్‌కు చెందిన దుస్తులు అందుబాటులో ఉంచామని, ఖరీదైన బ్రాండెడ్ ఉత్పత్తులు అత్యంత భారీ రాయితీలతో అందించే ఈ ప్రదర్శన సోమవారంతో ముగుస్తుందని తెలిపారు.

సనత్‌నగర్ కాంగ్రెస్ టికెట్ బీసీలకే కేటాయించాలి

కాచిగూడ: సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికే కేటాయించాలని సీనియర్ కాంగ్రెస్ నేత కల్లూరి విజయవర్ధన్ నాయుడు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోట నీలిమకు కాంగ్రెస్ టికెట్ వస్తుందంటూ నియోజకవర్గంలో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందన్నారు.